




కళింగదల్ రిజర్వాయర్‌లో పుష్కలంగా ఉన్న నీరు

చుట్టూ నీరు.. వాడుతున్న పైరు

● అధ్వానంగా సాగునీటి కాలువలు ● మరమ్మతులకు నోచుకోని వైనం ● నీరు ప్రవహించక ఎండుతున్న పంటలు ● ఆందోళనలో రబీ రైతులు


● మందస మండలం హొన్నాళి గ్రామానికి చెందిన రైతు హిరోమణి సాంత్రో తన కుటుంబంతో కలిసి వంగ పంటను సాగు చేస్తున్న దృశ్యమిది. మహేంద్ర తనయ నది (చీపి గెడ్డ) కాలువ ద్వారా గతంలో నీరు వచ్చేది. దీంతో ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. గత నాలుగేళ్లుగా కాలువ నిర్వహణను అధికారులు పట్టించుకోలేదు. దీంతో కాలువలో ఇసుక మేటలు వేసి, ముళ్లపొదలతో నిండిపోయింది. ఫలితంగా సాగునీరు అందడం లేదు. చేసేది లేక హిరోమణి కావిడి ద్వారా బిందెలతో నీటిని మోస్తూ పంటకు తడులు అందిస్తున్నాడు. గత నాలుగేళ్లుగా రూ.50వేల చొప్పున నష్టాలు చవిచూశానని, ఈ ఏడాదైనా కలిసివస్తుందనే ఆశతో మళ్లీ వంగ పంటను సాగు చేస్తున్నట్లు తెలిపాడు.


● మందస మండలం తాళ్లగురంటి గ్రామానికి చెందిన మహిళా రైతు బాలక సావిత్రి తనకున్న ఎకరం పొలంలో టమాటా సాగు చేస్తుంది. మెట్టు పొలం కావటంతో కాలువ ద్వారా నీరు అందడం లేదని, ఇంజిన్ సాయంతో మహేంద్ర తనయ నీటిని అందిస్తు న్నామని ఆమె చెబుతుంది. దీంతో సాగు ఖర్చు పెరిగిపోతుందని వాపోతుంది.

హరిపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి)

మందస మండలంలో డబార్సింగి, కళింగదళ్ వంటి ఐదు రిజర్వాయర్లు, జీవధార సునాముది, మహేంద్ర తనయా వంటి పలు నీటి వనరులు ఉన్నా రబీ పంటలకు సాగునీరు అందడం లేదు. కాలువలు అధ్వానంగా ఉండడంతో సాగునీరు ప్రవహించడం లేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ మోటా ర్లు ఉన్నా విద్యుత్ కోతలతో పని చేయడం లేదని, దీని వల్ల కనీసం రోజుకు పది సెంట్లు భూమికి కూడా తడి అందడం లేదని వాపోతున్నారు. గత డిసెంబరులో వరుసగా ఏర్పడిన తుఫాన్ల కారణంగా మందల మండలంలో భారీ వర్షాలు కురిశాయి. దీనివల్ల రిజర్వాయర్లు, చెరు వులు, నదుల్లో నీరు పుష్కలంగా ఉంది. దీంతో రైతులం తా రబీపై ఆశలు పెట్టుకున్నారు. మండలంలో సుమారు పది వేల హెక్టార్లలో వేరుశనగ, మినుము, పెసర, పొద్దు తిరుగుడు వంటి ఆరుతడి పంటలతో పాటు నువ్వులు, కూరగాయలు, చెరుకు వంటి పంటలు వేశారు. అయితే, కాలువలు పిచ్చి మొక్క లు, పూడికతో అధ్వానంగా ఉన్నాయి. వాటిని బాగు చేయకపోవడంతో ప్రసుత్తం నీరు ప్రవహించడం లేదు. మరోపక్క కరెంటు కోతలతో వ్యవసాయ మోటార్లు పనిచేయక ఛత్రపురం, చిన్నకోష్ఠ, కుంబిగాం, మహదేవిపురం తదితర ప్రాంతా ల్లో పంటలు ఎండిపోతున్నాయి. నీటి ఇంజిన్లతో, గూడలు వేసి పంటలకు నీరందిస్తున్నారు. దీనివల్ల అధిక పెట్టుబడి అవుతుందని తప్ప గిట్టుబాటు కావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కాలువలకు తాత్కాలిక మరమ్మతులు తప్ప, శాశ్వత పనులు జరగకపోవడంతో సాగునీరు అందడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కాలువలను బాగు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

ఉపాధి హామీ పథకం పనుల ద్వారా కాలువలను బాగు చేసుకోవాలి. సిమెంటు కట్టడాలు, మదుముల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేస్తాం. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

-శ్రీనివాసరావు, ఏఈ, జలవనరుల శాఖ


పిచ్చిమొక్కలతో నిండిన డబార్సింగి కాలువ


కుంబిగాం వద్ద కాపు దశలో నీరు లేక ఎండిపోయిన మిరప పంట

పంచాయతీకో మోడల్ స్కూల్

● హైస్కూళ్లగా యూపీ పాఠశాలలు ● జిల్లా విద్యాశాఖ అధికారుల కసరత్తు ● విద్యావ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం

నరసన్నపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది. ఇప్పటికే ఇంటర్ విద్యకు సంబంధించి సమూల మార్పులకు శ్రీకారం చుట్టగా.. తాజాగా ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ముందడుగు వేసింది. అందులో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల విలీనానికి సంబంధించి జారీ చేసిన జీవో నెంబరు 117ను రద్దు చేసి, కొత్త ప్రతిపాదనలు రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రతి పంచాయతీలో ఒక మోడల్ పాఠశాలను ఏర్పాటు చేసేలా జాబితాను తయారు చేసి, వచ్చే విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని ఆదేశించింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ సమగ్ర వివరాలను సేకరించాలని సూచించింది. ఈ మేరకు ఎంఈవో, హెచ్ఎంలతో మండలానికో టీమ్‌ను ఏర్పాటు చేసి జాబితాలను సిద్ధం చేస్తున్నారు.


నరసన్నపేట మండలంలోని జమ్ము ప్రాథమిక పాఠశాల

జీవో 117తో తీవ్ర ఇబ్బందులు

వైసీపీ పాలనలో విడుదల చేసిన జీవో నెంబరు 117తో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీప హైస్కూళ్లలో విలీనం చేశారు. దీనివల్ల చాలా పాఠశాలలు మూతపడ్డాయి. అందులో పని చేసిన ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఈ జీవోను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జీవో 117ను రద్దు చేసి కొత్తగా ప్రతి మేజర్ పంచాయతీకి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం 60 మంది పిల్లలు ఉన్న పాఠశాలలను ఎంపిక చేయాలని సూచించింది. అలాగే, 6,7,8 తరగతుల్లో 60 మందికిపైగా ఉన్న యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కసరత్తు ప్రారంభించారు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో ప్రభుత్వ, మండల, జడ్పీ, మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలు 1,915 ఉన్నాయి. వీటిల్లో 45,018 మంది విద్యార్థులు చదువుతున్నారు. 315 యూపీ (మిగతా 4వ పేజీలో..)

అటు ఇటు వెళ్లాలా?

● సీతంపేట ఐటీడీఏకి చైర్మన్ ఎవరో తెలియక గందరగోళం
● రెండు జిల్లాల్లో సమావేశాలు ● అధికారులకు తప్పని ఇబ్బందులు
● మితిమీరిన అధికార పార్టీ నాయకుల జోక్యం

మెళియాపుట్టి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం గిరిజనుల అభిప్రాయం సేకరించకుండా సీతంపేట ఐటీడీఏను అడ్డగోలుగా విభజించింది. దీన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో కలిపేసింది. దీనివల్ల జిల్లాకు ఐటీడీఏ కరువైంది. కానీ, సీతంపేట ఐటీడీఏలోనే జిల్లాకు చెందిన 16 మండలాలు కొనసాగుతున్నాయి. ఐటీడీఏ అటు పార్వతీపురం, ఇటు శ్రీకాకుళం జిల్లాలో ఉండడంతో దీనికి చైర్మన్ ఎవరో తెలియక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు సీతంపేటలో, మరికొన్నిసార్లు శ్రీకాకుళం జిల్లాలో సమావేశాలను నిర్వహిస్తుండడంతో అటు వెళ్లాలా?.. ఇటు వెళ్లాలా? తెలియక అధికారులు గందరగోళానికి గురవుతున్నారు.

జిల్లాలో పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పరిధిలో 20 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,239 గిరిజన గ్రామాలు ఉన్నాయి. మొత్తం 48,142 కుటుంబాలు, 1,66,118 మంది జనాభా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే జిల్లాల విభజనలో భాగంగా ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోయింది. దీంతో 20 మండలాల్లో నాలుగు మండలాలు (పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని) పార్వతీపురంలో కలిసిపోయాయి. 16 మండలాలు మాత్రం శ్రీకాకుళం జిల్లాలోనే ఉన్నాయి. అయితే, ఈ ఐటీడీఏకు ఏ జిల్లాకు చెందిన కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో ఒకేసారి సమావేశాలు ఏర్పాటు చేస్తుండడంతో ఎటువెళ్లాలో తెలియక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు పార్వతీపురం, మరికొన్నిసార్లు శ్రీకాకుళం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.


సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

కానరాని పాలక మండలి సమావేశాలు

ఐటీడీఏ పాలక మండలి సమావేశాలు గత మూడేళ్లుగా జరగడం లేదు. వాస్తవానికి ఏడాదికి నాలుగు సార్లు సమావేశాలు నిర్వహించి పథకాల కోసం చర్చించాలి. వాటి అమలు తీరును అధికారులు, ప్రజాప్రతినిధులు తెలుసుకోవాలి. అయితే, గత వైసీపీ ప్రభుత్వంలో చివరిసారిగా 2022 జనవరి 29న పాలకవర్గ సమావేశం (మిగతా 5వ పేజీలో..)

10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ క్లస్టర్

● మూలపేట పోర్టు చుట్టూ ఏర్పాటు
● డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం: ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు చుట్టూ 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని, మూడు ఏజెన్సీలతో డిటేల్ ప్రాజెక్ట్ రిపోర్టులు (డీపీఆర్) సిద్ధం చేస్తున్నట్లు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పోర్టు చుట్టూ ఉన్న భూముల వివరాలు, భూ సేకరణ అవకాశాలు, రోడ్లు, రైలు మార్గాలు, నీరు, విద్యుత్ సౌకర్యాలు తదితర వివరాలపై సంబంధిత ఏజెన్సీలు సర్వే చేస్తాయి. డ్రాఫ్ట్ ప్లాన్ తయారీ కోసం రెవెన్యూ అధికారుల బృందం సహకారం అందించనుంది. ప్రాజెక్ట్ డిటేల్ రిపోర్టుకు గాను మాస్టర్ ప్లాన్ తయారీలో భాగంగా మూడు ఏజెన్సీలు పోర్టు చుట్టుపక్కల పరిశీలిస్తాయి. ఆ ఏజెన్సీల ప్రతిపాదనల మేరకు ఈ ప్రాంతంలో ఎన్ని పరిశ్రమలు నెలకొల్పవచ్చు, ఎంతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చు అన్నది గుర్తిస్తాం. ప్రస్తుతం సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు పరిధిలో 4,500 ఎకరాల ఉప్పు భూములు, ఈస్ట్‌కోస్ట్ పవర్ ప్లాంట్ వద్ద కొనుగోలు చేసిన సమీర్‌పేట లాజిస్టిక్ భూములు 2,100 ఎకరాలు, ఏపీఐఐసీ పరిధిలోని 1,300 ఎకరాలు, 900 ఎకరాల జిరాయతీ భూమి, 460 ఎకరాల ప్రభుత్వ భూములతో పాటు మరో 1,500 ఎకరాల ప్రైవేట్ భూములు అవసరమని ప్రాథమికంగా గుర్తించాం. ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి ఆసక్తి చూపుతుంది. శరవేగంగా డీపీఆర్, డ్రాఫ్ట్‌ప్లాన్ తయారు చేస్తున్నాం.' అని తెలిపారు.


మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

● మొదటి రోజు పరీక్షకు 13మంది గైర్హాజరు

నరసన్నపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలోని కోర్ టెక్నాలజీలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 298 మందికి గాను ఏడుగురు, మధ్యాహ్నం 295 మందికి ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొలుత పరీక్ష కేంద్రం వద్ద నిర్వాహకులు అభ్యర్థులను తనిఖీ చేసి లోపలకు విడిచిపెట్టారు. ఈ నెల 30 వరకు పరీక్షలు జరనున్నాయి.



నరసన్నపేట కోర్ టెక్నాలజీ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు

రికార్డు స్థాయిలో..

● 737 యూనిట్ల రక్తం సేకరణ
● లోకేశ్ జన్మదినం పురస్కరించుకుని పలాసలో మెగా రక్తదాన శిబిరం

పలాస, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినం పురస్కరించుకుని బుధవారం పలాసలోని పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. రెడ్‌క్రాస్, ఎన్టీఆర్ ట్రస్టు(విశాఖపట్నం), టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, కాశీబుగ్గ ప్రాణదాత బ్లడ్‌బ్యాంకులు సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయి. ఎమ్మెల్యే శిరీషతో పాటు ఆమె భర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన యువత, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి రక్తదానం చేశారు. ఉత్తరాంధ్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా మొత్తం 737 యూనిట్ల రక్తాన్ని సేకరించి రికార్డు సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా లోకేష్ జన్మదినం పురస్కరించుకుని జరిగిన రక్తదాన శిబిరాల్లో పలాస శిబిరం నెంబర్‌వన్‌గా నిలిచింది.


రక్తదానం చేస్తున్న శిరీష, వెంకన్నచౌదరి

మృతి చెందాడని అంత్యక్రియల ఏర్పాట్లు

● గ్రామానికి చేరుకున్న బంధువులు
● పాడె సిద్ధం చేస్తుండగా లేచి కూర్చున్న వృద్ధుడు అప్పారావు

జి.సిగడాం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆ వృద్ధుడు చనిపోయాడుకున్నారు. అంత్యక్రియల ఏర్పాట్లు చేస్తున్నారు. చివరి చూపు కోసం బంధువులంతా వచ్చారు. అయితే ఆ వృద్ధుడు లేచి కూర్చున్నాడు. అంతే.. కుటుంబీలు, బంధువులు ఒక్కసారిగా నివ్వెరపోయారు. ఈ ఘటన జి.సిగడాం మండలంలో జరిగింది. సీతంపేట గ్రామానికి చెందిన ధర్మవరపు అప్పారావు అనే 85 ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో ఇటీవల శ్రీకాకు ళం ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. దీంతో ఇక అప్పారావు బతికే అవ కాశం లేదని వైద్యులు చెప్పటంతో కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం అంబులెన్స్ ద్వారా గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో అప్పారావులో కదలిక కనిపించక పోవడంతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు భావించారు. వెంటనే తమ బంధువులకు సమాచారం ఇవ్వటంతో పాటు అంత్యక్రియలకు అన్నీ సిద్ధం చేశారు. దీంతో గ్రామంలో ఉన్న వారు కట్టెలు, పూలదండలు, మేలతాళాలు రెడీ చేశారు. అంబులెన్స్ గ్రామంలోకి ఉదయం 10-30 గంటలకు చేరుకున్నారు. తర్వాత ఇంటి వద్ద మంచంపై పడుకోబెట్టారు. అప్పారావు మృతి చెందాడని బందువులు, కుటుంబ సభ్యులు భోరున విలపించారు. పాడెకట్టి శ్మశానానికి తీసుకు వెళ్లటానికి సిద్ధం చేయగా అప్పారావు చిన్నగా కళ్లు తెరిచారు. మరో పది నిమిషాల్లో మంచంపై కూర్చోవటంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. ఇక అప్పారావుకు మరణం లేదని, మృత్యుంజయుడని అందరూ ఆనందం వ్యక్తం చేశారు.


మంచంపై లేచి కూర్చున్న అప్పారావు

జగతిమెట్టపై విజి'లెన్స్'

● జగనన్న కాలనీలో అక్రమాలపై విచారణ
● ఇప్పటికే వివరాలు సేకరించిన అధికారులు
● వైసీపీ నాయకుల్లో వణుకు

4లో

గణతంత్ర వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు

4లో

● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

సొన్నా పొడ్డ.. @ లావణ్యకోట





నిప్పులపై కాలుస్తూ..

- నోరూరించే మిఠాయి
- ఆంధ్ర, ఒడిశాలలో మంచి డిమాండ్

మెళియాపుట్టి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి)

హైదరాబాద్ అంటే బిర్యానీ.. మందస పేరు చెబితే కోవా గుర్తుకొచ్చినట్టు.. లావణ్యకోట అంటే సొన్నా పొడ్డ కళ్ల ముందు మెదులుతుంది. సొన్నాపొడ్డతో పాటు ఇక్కడి రసగుల్లా సైతం నోరూరిస్తుంది. సొన్నా పొడ్డ కావాలంటే మూడు రోజుల ముందు డబ్బులు చెల్లించి... టోకెన్ తీసుకోవలసి ఉంటుందంటే దీనికి ఉన్న డిమాండ్‌ను ఊహించవచ్చు. సంక్రాంతి సీజన్‌లో ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని లావణ్య కోటకు వివిధ ప్రాంతాల వారు కేవలం సొన్నా పొడ్డ కొనుగోలుకే వస్తుంటారంటే అతిశయోక్తి కాదు.



సొన్నాపొడ్డ తయారు చేస్తున్న దృశ్యం



సొన్నా పొడ్డ

ఎలా తయారు చేస్తారంటే...

పాలు, పంచదార, గోధుమ నూక మిశ్రమంతో సొన్నా పొడ్డను తయారు చేస్తారు. ఒక రోజుకు దాదాపు వంద లీటర్ల పాలు వినియోగిస్తున్నట్టు వీరు తెలిపారు. పాలు మరిగించి.. పంచదార పాకం తీసి.. గోధుమ నూక కలిపి దీనిని తయారు చేస్తారు. నిప్పులపై ఓ చిన్న పాత్రలో ఈ మిశ్రమాన్ని పోసి.. కాల్చడం దీని ప్రత్యేకత. ఇలా తయారుచేసిన సొన్నా పొడ్డ మంచి రుచికరంగా ఉంటుంది.

40 ఏళ్లుగా తయారీ...

లావణ్యకోట గ్రామానికి చెందిన గణేష్ పాణిగ్రాహి కుటుంబం గత 40 ఏళ్లుగా మిఠాయిలు తయారు చేస్తున్నారు. వీరు తయారు చేసేవాటిలో సొన్నాపొడ్డకు డిమాండ్ ఎక్కువ. ఈ మిఠాయి కారణంగా లావణ్యకోటకు ఆంధ్రా, ఒడిశాలలో మంచి గుర్తింపు వచ్చింది. పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, శ్రీకాకుళం, టెక్కలి, ఒడిశాలోని పర్లాఖిమిడి, బరంపురం తదితర ముఖ్య పట్టణాలతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా దీనిని సరఫరా చేస్తున్నట్టు గణేష్ కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒక్కో సొన్నాపొడ్డ రూ.300 నుంచి రూ.500 పలుకుతుంది.

వారసత్వంగా...

సుమారు 40 ఏళ్ల నుంచి సొన్నాపొడ్డను తయారు చేస్తున్నాం. మా తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా ఇది వచ్చింది. ఈ మిఠాయి తయారు చేయాలని వివిధ ప్రాంతాల నుంచి ఆర్డర్లు అందుతున్నాయి. కానీ అందజేయలేకపోతున్నాం. అందువల్ల ఆర్డర్లను వదులుకుంటున్నాం. సంక్రాంతి సమయంలో వివిధ ప్రాంతాల నుంచి సొంత ఊళ్లకు వచ్చేవారు ప్రత్యేకంగా ప్యాక్ చేయించి పట్టుకెళుతుంటారు. శ్రీకాకుళం, పర్లాఖిమిడి ప్రాంతాలకు ఎక్కువగా సరఫరా చేస్తుంటాం.

-గణేష్ పాణిగ్రాహి, లావణ్యకోట

ఆయుషి..

నాట్యంలో ఔరా అనిపించి!



- చిన్నతనం నుంచే నృత్యంపై ఆసక్తి
- ఆంధ్ర, ఒడిశాల్లో వందలాది ప్రదర్శనలు
- వివిధ రికార్డులు సొంతం

కంచిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి)

'పిట్ట కొంచెం.. కూత ఘనం' అన్న మాటను అక్షరాలా నిజం చేసి చూపిస్తోంది కంచిలికి చెందిన ఆయుషి మహంతి. పదమూడేళ్లకే కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ నృత్యాలలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ... వందల సంఖ్యలో ప్రదర్శనలు ఇస్తూ.. అనేక రికార్డులను సొంతం చేసుకుంది. స్థానిక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆయుషి తండ్రి అభిమన్యు మహంతి కాంట్రాక్టర్ కాగా, తల్లి ఉమా మహాపాత్రో కవిటి మండలం పెద్దమునిపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయుషి చిన్నతనం నుంచే నాట్యంపై ఇష్టం చూపించడాన్ని గమనించిన తల్లిదండ్రులు ఒడిశా రాష్ట్రం బరంపురం పట్టణానికి చెందిన నాట్యగురువు శివప్రసాద్ వద్ద శిక్షణ ఇప్పించారు. తక్కువ సమయంలోనే కూచిపూడి, భరత నాట్యం, ఒడిసీ ప్రదర్శనలతో అభిమానులను సంపాదించుకుంది. కంచిలి మండలం ఆముదాలపుట్టుగ జామి ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో మొదటి ప్రదర్శన ఇచ్చింది. అనతి కాలంలోనే వివిధ ప్రాంతాల్లో తన ప్రదర్శనలతో ఆకట్టుకుంది.

ఇవీ రివార్డులు..

తన ప్రదర్శనలతో ఆయుషి వివిధ బహుమతులు అందుకోవడంతో పాటు రికార్డులూ సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు సాంస్కృతిక సంఘం ఆయుషికి అవార్డు అందజేసింది. 'అయిగిరి నందిని' శ్లోకానికి బరంపురంలో చేసిన నృత్యంతో హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో తన పేరును లిఖించుకుంది. దీంతో పాటు ఫెంటాస్టిక్ ఎచీవ్‌మెంట్స్ రికార్డ్, జెమ్స్ వరల్డ్, ఇండియా రికార్డ్స్, మార్వలెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూనిక్యూ వరల్డ్ రికార్డులలో తన పేరును నమోదు చేసుకుంది. మండల కేంద్రం కంచిలి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇటీవల అపోటా ఆధ్వర్యంలో నిర్వహించిన మేధా సమ్మాన్ కార్యక్రమంలో ఆయుషి ఇచ్చిన ప్రదర్శన ఇటు ఆంధ్ర, అటు ఒడిశా రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒడిశా అసెంబ్లీ స్పీకర్ సురమా పాఢి, మంత్రులతో పాటు మన రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు ఆయుషిని అభినందించారు.



ఒడిశాలో ప్రదర్శనకు బహుమతి అందుకుంటూ..

ఒడిశా, ఆంధ్రాల్లో గుర్తింపు..

ఒడిశా రాష్ట్రం పూరీ జగన్నాథ దేవాలయ ప్రాంగణంలో ఆయుషి ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. భువనేశ్వర్, కటక్, బరంపురం, గోపాల్‌పూర్‌లలో జరిగిన వివిధ కార్యక్రమాలలో తన ప్రదర్శనలతో శభాష్ అనిపించుకుంది. ఒడిశాలోని చీకటి శాసన సభ్యులు మనోరంజన్ ద్యాన సామంతరాయ్ నుంచి అవార్డు అందుకుంది.



ఆసియన్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువపత్రం



అభిరూప్

తప్పెవరిదో చెప్పేస్తుంది

- హెల్మెట్‌పై ప్రత్యేక కెమెరా
- బెంగాల్ యువకుడి సృష్టి
- దేశంలోని వివిధ ప్రాంతాల సందర్శన

టెక్కలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మనం వాహనం నడిపేటప్పుడు అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే... అందులో తప్పెవరిదో అప్పటికప్పుడే తేలితే సమస్య పరిష్కారానికి వెంటనే మార్గం సుగమమవుతుంది కదూ. ఇప్పటి వరకూ ఎక్కడైనా ప్రమాదాలు సంభవిస్తే.. వివరాలు తెలుసుకునేందుకు పరిసరాల్లోని సీసీ కెమెరాలపై ఆధార పడుతున్నాం. ఒకవేళ సీసీ కెమెరాలు లేకపోతే ఆధారాలు సేకరించడం కష్టమవుతుంది. అలాకాకుండా మనతోనే ఓ కెమెరా ఉంటే... ఈ ఆలోచన ఓ యువకుడిని ఆచరణలో పెట్టేలా చేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుబ్లీ జిల్లా చంద్రానగర్ ప్రాంతానికి చెందిన అభిరూప్ చంద్ర్ అనే యువకుడు దీన్ని అందుబాటులోకి తెచ్చాడు. ఫొటోగ్రఫీ అంటే ఇష్టపడే ఆ యువకుడు వారం రోజుల కిందట తన స్పోర్ట్స్ బైక్‌పై ఓ హెల్మెట్ ధరించి... దేశంలోని ప్రధాన నగరాల్లోని చిత్రాలను తన కెమెరాలో బంధించేందుకు బయలు దేరాడు. బుధవారం టెక్కలి సమీపంలో జాతీయ రహదారిపై కనిపించాడు. ఆ యువకుడు ధరించిన హెల్మెట్‌పై ఓ యాక్షన్ కెమెరా ఉంది. ఈ సందర్భంగా ఆ యువకుడు మాట్లాడుతూ వాహన చోదకులు నిబంధనలు ఉల్లంఘిస్తే ఈ కెమెరాలో రికార్డవుతాయని వెల్లడించాడు. ఎదుటి వాహనాలు ఏమైనా వచ్చి ఢీకొంటే ఈ యాక్షన్ కెమెరాలో రికార్డవుతుందని తెలిపాడు. వాహన ప్రమాదాలు జరిగేటప్పుడు నిబంధనలు ఎవరు ఉల్లంఘించారో ముందుగా తెలుస్తుందన్నాడు. వాహనం నడిపేటప్పుడు అతి సమీపంలో ఉన్న వాహన సమాచారంతో పాటు తన ముందుగా కొద్ది దూరంలో ఏ వాహనం ఉందనే విషయం తెలుసుకోవచ్చునని చెప్పాడు. ఈ యాక్షన్ కెమెరా సామర్థ్యం 200 జీబీ. దీనిని హెల్మెట్‌తో పాటు సెల్‌ఫోన్‌కు లింక్ చేశానని.. దీనిలో సమాచారం రికార్డు అవుతుందని తెలిపాడు. దీని ఖరీదు రూ.35 వేల అని అభిరూప్ చంద్ర్ చెప్పాడు. ఇప్పటికే ఒడిశాలోని గోపాల్‌పూర్, చిల్కా సరస్సులను సందర్శించినట్టు వివరించాడు. విశాఖ, హైదరాబాద్, ముంబయి వంటి నగరాలలో ట్రాఫిక్ పరిస్థితులు, ఇతర అంశాలపై ఫొటోలను తీయాలనే సంకల్పంతో ఈ యాత్రకు శ్రీకారం చుట్టినట్టు చెప్పాడు.

పంచాయతీకో మోడల్ స్కూల్

(మూడో పేజీ తరువాయి)

పాఠశాలల్లో ఆరు, ఏడు తరగతులకు సంబంధించి 22,569 మంది చదువుతున్నారు. వీటిల్లో 60 మందికి పైగా విద్యార్థులు ఉండే ప్రాథమిక పాఠశాలల్లో ఒకదానిని ఎంపిక చేసి మోడల్ స్కూల్‌గా ఏర్పాటు చేయనున్నారు. అలాగే 60 మందికి పైగా ఉండే ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 60 మంది కంటే తక్కువగా ఉంటే ఆ విద్యార్థులను సమీప హైస్కూళ్లకు పంపిస్తారు. అదే విధంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు, హెచ్‌ఎంల నియామకం చేపట్టనున్నారు. దీనికి సంబంధించి పూర్తి విధివిధానాలను ఉన్నతాధికారులు రూపొందిస్తున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు జాబితాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. త్వరలో విద్యాశాఖ కమిషనర్‌తో జరిగే సమావేశంలో దీనిపై పూర్తిస్థాయి స్పష్టత వస్తుందని, కొత్తవిద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలను ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని అధికారులు చెబుతున్నారు.



జగతిమెట్ట దరి కాలనీ

జగతిమెట్టపై విజి'లెన్స్'

- జగనన్న కాలనీలో అక్రమాలపై విచారణ
- ఇప్పటికే వివరాలు సేకరించిన అధికారులు
- వైసీపీ నాయకుల్లో వణుకు

టెక్కలి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జగతిమెట్ట దరి లబ్ధిదారులకు కేటాయించిన జగనన్న కాలనీలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయంటూ పత్రికల్లో కథనాలు రావడంతో టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి స్పందించారు. విజిలెన్స్ విచారణకు సిద్ధమయ్యారు. వ్యవహారంపై లోతుగా విచారణ చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించడంతో... విజిలెన్స్ అధికారులతో దర్యాప్తు జరిపించేందుకు ఆర్డీవో రంగం సిద్ధం చేశారు. టెక్కలి దరి జగతిమెట్ట వద్ద సుమారు 312 మందికి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. వీరిలో స్థానికేతరులతో పాటు అర్హత లేని వారు, లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన వారు ఎక్కువ శాతం ఉన్నట్లు పత్రికల్లో వివిధ సందర్భాల్లో కథనాలు వెలువడ్డాయి. దీంతో ఆర్డీవో కృష్ణమూర్తి స్పందించారు. ఇతర మండలాల నుంచి రెవెన్యూ సిబ్బందిని రప్పించి... ఇటీవల వారం రోజుల పాటు దర్యాప్తు చేపట్టారు. రెవెన్యూ సిబ్బంది దర్యాప్తులో కేవలం 55 మంది మాత్రమే తమకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కట్టుకున్నట్లు తేలింది. మరో 226 ఇళ్ల పట్టాలు చేతులు మారినట్లు ప్రాథమికంగా గుర్తించారు. 31 మంది అసలు పునాదులు వేయలేదని గుర్తించారు. అంతేకాకుండా జగతిమెట్ట ఇళ్ల కాలనీని 312 మందికి కేటాయిస్తే... అక్కడ 412 ఇళ్లకు సంబంధించిన లేఅవుట్లు కనిపిస్తున్నట్లు గుర్తించామని రెవెన్యూ సిబ్బంది ఆర్డీవోకు సమాచారం అందించారు.

రికార్డు లేదని...

జగతి మెట్ట ఇళ్ల కాలనీలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకోవడం వెనుక అప్పటి వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల పాత్ర ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ వ్యవహారంలో అప్పటి రెవెన్యూ సిబ్బంది పెద్దఎత్తున తప్పిదాలకు పాల్పడ్డారు. జగతిమెట్ట ఇళ్ల కాలనీ రికార్డులతో సబ్‌కలెక్టర్ కార్యాలయానికి హాజరు కావాలని ఆర్డీవో ఆదేశించడంతో రెవెన్యూ సిబ్బంది నీళ్లు నములుతున్నారు. తమ కార్యాలయంలో కాలనీ రికార్డు కనిపించడం లేదని చేతులెత్తేశారు. దీంతో ఆశ్చర్యపోయిన ఆర్డీవో... గత ఐదేళ్లగా ఈ కార్యాలయంలో పనిచేసిన రెవెన్యూ సిబ్బందిని ఇటీవల పిలిపించి వాస్తవాలు చెప్పాలని ప్రశ్నించారు. అయినా ఎవరూ నోరు మెదపలేదు. చివరకు ఆర్డీవో జగతిమెట్ట ఇళ్ల కాలనీ వ్యవహారం నిగ్గు తేల్చాలని విజిలెన్స్ ఎస్పీని కోరారు.

భారీగా అక్రమాలు..

జగతిమెట్ట దరి ఇళ్ల కాలనీకి సంబంధించి అప్పటి వైసీపీ నాయకులు ఒక్కో పట్టాను రూ.ఆరు నుంచి రూ.పది లక్షల వరకు అమ్ముకున్నారు. కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఫోర్జరీ సంతకాలు, మరికొందరు కింది స్థాయి అధికారులతో కలిసి ఈ వ్యవహారాన్ని చక్కబెట్టారు. అప్పట్లో ఓ వీఆర్‌వో లాగిన్‌తో అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ సిబ్బంది ఈ వ్యవహారాలు చక్కబెట్టారు. ఆ వీఆర్‌వోకు అసలు విషయం తెలిసి గుండెపోటుతో మరణించాడు. ఈ లేఅవుట్‌కు సమీపంలోని అక్కవరం పంచాయతీ పరిధిలో కూడా ఇళ్ల కాలనీ లేఅవుట్‌లో పెద్దఎత్తున అక్రమాలు వెలుగుచూశాయి. అనర్హులకు, స్థానికేతరులు ఇళ్ల పట్టాలు కొనుగోలు చేసిన వారు అందులో ఉన్నారు. జగతిమెట్ట కాలనీలో అక్రమాలు జరిగాయంటూ ఆర్డీవో విజిలెన్స్ విచారణను కోరడంతో ఈ దందాతో సంబంధం ఉన్న కొంతమంది వైసీపీ నాయకులు, కార్యకర్తల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

విజిలెన్స్ విచారణను కోరాం..



జగతిమెట్ట దరి ఇళ్ల కాలనీ వ్యవహారంలో అక్రమాలు వెలికి తీసేందుకు దర్యాప్తు చేయాలని విజిలెన్స్ అధికారులను కోరాం. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు లభ్యం కాలేదు. గృహ నిర్మాణ శాఖ అధికారుల వద్ద ఉన్న జాబితాను తీసుకొని పరిశీలించాం. అప్పట్లో ఎవరెవరికి పట్టాలు ఇచ్చారు? ఎంతమంది అర్హులు? వంటి వివరాలు సేకరించాలని ఇటీవల ఇతర మండలాల రెవెన్యూ సిబ్బందితో దర్యాప్తు చేయించారు. ఈ సమయంలో 55మంది అర్హులు ఉన్నట్లు గుర్తించాం. మిగిలిన వారిని పట్టాలతో ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు రమ్మని పది రోజులు గడువిచ్చినా స్పందన కరువైంది. జగతిమెట్ట కాలనీ లో రెండంతస్తుల భవనాలు నిర్మించినట్టు గుర్తించాం. ఏ స్థాయి ఉద్యోగి తప్పిదాలకు పాల్పడినా వారిపై క్రిమినల్ కేసులకు వెనుకాడం. అక్రమాలకు పాల్పడిన లబ్ధిదారుల ఇళ్ల పట్టాలు అవసరమైతే రద్దు చేస్తాం.

-ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి

గణతంత్ర వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భారత గణతంత్ర వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఆరోజు ఉదయం 7 గంటల నుంచి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమైందని తెలిపారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో కలిసి వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలందరూ కూర్చొని వీక్షించేందుకు సరిపడా సీట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు, ఆహ్వానితుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, ఆర్డీఓ సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్ కుమార్, డీఎస్పీ సిహెచ్.వివేకానంద, డీఎస్‌డీఓ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న జేసీ, ఎస్పీ తదితరులు

అటు వెళ్లాలా?.. ఇటు వెళ్లాలా?

(మూడో పేజీ తరువాయి)

జరిగింది. ఆ తరువాత నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో ఐటీడీఏలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

వారిదే పెత్తనం..

గతంలో ఐటీడీఏ పరిధిలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులను స్థానిక గిరిజన నేతలకు అప్పగించేవారు. దీనివల్ల గిరిజనులను ఆర్థికంగా ముం దుకు తీసుకెళ్లడానికి అవకాశం ఉంటుందని అధికారులు భావించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ పరిస్థితి మారింది. కూటమి నాయకులు తమకు నచ్చిన వారికి పనులు అప్పగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని హిరమండలం, మెళియాపుట్టి, పలాస, మందస, టెక్కలి మండలాల్లో 73 పనులు చేపట్టేందుకు గాను ఇటీవల ప్రభుత్వం రూ.8కోట్లను విడుదల చేసింది. అయితే కొంత మంది అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తుల పేరుతో ఇతర జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించినట్లు తెలుస్తోంది. దీనికోసం 20 శాతం కమీషన్ తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న కొందరు గిరిజన నేతలు తమకు ఆ పనులు అప్పగించాలని అడిగితే 'మీరు ఐటీడీఏ పనులు గురించి మరిచిపోండి.. మిగతా ఏమైనా ఉంటే మాట్లాడాలని' కొందరు కూటమి నాయకులు చెబుతుండడంతో వారు షాక్‌కు గురైనట్లు తెలిసింది. అలాగే, ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు బయట ప్రాంతాల నుంచి తమ స్నేహితులను తీసుకువచ్చి అధికార పార్టీ నాయకులకు పరిచయం చేస్తున్నారు. వారికి పీసీలు రూపంలో పనులు అప్పగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పాలకవర్గ సమావేశాలు జరిగితే ఇలాంటి అక్రమాలు ఎన్నో బయటపడే అవకాశం ఉంది.

నిర్వహణ లేక.. నిరుపయోగం

● సంతబొమ్మాళి మండలంలో శిథిలావస్థకు చేరిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు



నిరుపయోగంగా మారిన బోరుభద్రలోని చెత్త సంపద కేంద్రం

సంతబొమ్మాళి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల్లో రూ.లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్వహణకు నోచుకోకపోవడంతో కొన్నిచోట్ల నిరుపయోగంగా మారాయి. మరికొన్ని చోట్ల శిథిలా వస్థకు చేరాయి. 34 పంచాయతీలకుగాను 31 పంచాయతీలకు చెత్త నుంచి సంపద కేంద్రాలు మంజూరు కాగా వీటిలో ఆరు కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. గతంలో తుఫాన్ల వల్ల బోరుభద్ర, గోవిందపురం, జగన్నాథపురం, ఎస్‌బీకొత్తూరు పంచాయతీల్లోగల చెత్తకేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. కనీసం వీటిని మరమ్మతులు చేసేందుకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆయాగ్రామాల ప్రజలు చెబుతున్నారు. సంతబొమ్మాళి,చిన్నతుంగాంలో మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగతా గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో చెత్తను రోడ్ల పక్కన వేస్తుండడంతో కుళ్లడం వల్ల వ్యాధులు ప్రబలుతున్నా యని పలువురు వాపోతున్నారు. అలాగే చెత్తతో సంపద తయారు చేయకపోవడంతో చెత్తకు నిప్పంటిస్తున్నారు. దీంతోపొగతో వాహనచోదకులు, ప్రజలుఇబ్బందిపడుతున్నారు. అలాగే నిరుపయోగంగా ఉండడంతో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. కాగా పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకువస్తామని సంతబొమ్మాళి ఉపా ధిహామీ పథకం ఏపీవో పంగ నర్సింహమూర్తి తెలిపారు. వీటిని పంచాయతీలు నిర్వహించాలని తెలిపారు. పాడైన చెత్త సంపదకేంద్రాలు పంచాయతీ నిధులతో నిర్మించాలని చెప్పారు.

సమాజహిత రచనలు అవసరం

● బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రజని



గిడుగు దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ రజని

ఎచ్చెర్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సమాజహిత రచనలు అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. బుధవారం వర్సిటీలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామ్మూర్తి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా అధ్యయనవేత్త, కథకులు డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖరరావు రచించిన గిడుగుదర్శనం పుస్తకాన్నిఆవిష్కరించారు. వర్సిటీ ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ,వర్సిటీ ఎస్‌వో సామ్రాజ్యలక్ష్మి, శ్రీకాకుళంసాహితీ ప్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్, ఎన్.రమణారావు, వర్సిటీ అధ్యాపకులు కె.ఉదయకిరణ్, జి.లీలావరప్రసాదరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పనులకు వెళ్లకుండా మస్తర్లు

● ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాల గుర్తింపు

● శ్రీకాకుళం రూరల్ మండలంలో నలుగురు టీఏలకు షోకాజ్ నోటీసులు

శ్రీకాకుళం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం గ్రామీణ మండలంలో 2023-24లో రూ. 18 కోట్లతో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈమేరకు నలుగురు టెక్నికల్ అసిస్టెంట్ల (టీఏ)లకు షోకాజ్‌నోటీసులు జారీచేశారు. బుధవారం శ్రీకాకుళం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బొడ్డేపల్లి శైలజ అధ్యక్షతన ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధిహామీ పనులు సామాజిక తనిఖీల్లో గుర్తించిన అక్రమాలపై చర్చించారు.ఉపాధి పనులకు వెళ్లకుండానే మస్తర్లు వేయడం, తక్కువ పనులకు ఎక్కువ మస్తర్లు వేయడం, గట్టుపై చేసిన పనులను చెరువులో చేసినట్లు చూపించడం వంటి అక్రమాలను సామాజిక తనిఖీలో గుర్తించారు. వారంరోజుల తర్వాత ఆప్సెంట్లను ప్రజెంట్లుగా దిద్దడం వంటి అవకతవకలతో 18 కోట్ల రూపాయల పనుల్లో మొత్తం 97 లక్షల రూపాయలు అవినీతి జరిగినట్లు పీడీ బి.సుధాకర్ నిర్ధారించారు. ఈ మేరకు సర్పంచ్‌లతో చర్చించిన అనంతరం నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లకు షోకాజ్‌నోటీసులు జారీచేశారు. అలాగే అవకతవకలకు సహకరించిన ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు.కార్యక్రమంలో ఏపీడీ శైలజ, డీవీవో స్వరూపారాణి, ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి: ఎస్పీ



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి) అపరిష్కృతంగా ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. బుధవారం రాత్రి జిల్లాపోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ కేవీ రమణతో కలిసి ఎస్పీ మహేశ్వరరెడ్డి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారాడీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతోచిన్నారులు, మహిళలపై జరుగుతున్న దాడులు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార, హిట్ అండ్ రన్ కేసులపై సమీక్షించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోక్సో అత్యాచార కేసుల్లో సాక్షాధారాలు సేకరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు డ్రమ్స్‌స్పీడ్ బ్రేకర్లు,రేడియం స్టిక్కర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

● వీఆర్వోపై చర్యలకు ఆర్డీవో సాయి ప్రత్యూష ఆదేశం

పొందూరు, జనవరి (ఆంధ్రజ్యోతి) 22 : ప్రభుత్వభూముల పరి రక్షణే ధ్యేయమని, నీటివనరులు, ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలుతప్పవని ఆర్డీవో కె.సాయిప్రత్యూష హె చ్చరించారు. బుధ వారం పొందూరులోని సోషల్ క్లబ్ స్థలంపై నెలకొన్న స్థలవివాదం పై శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూష తహసీల్దార్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 188 సర్వేనంబరు పోరంబోకు స్థలంలో ఉన్న సోషల్‌క్లబ్ స్థలం తమదేనని ఆరుగురు 187 సర్వేనంబరుతో పొజిషన్ ధ్రువపత్రం పొందారు. వీరినుంచి కొనుగోలు చేసి వేరొక వ్యక్తి ఈస్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు చేసిన ప్రయత్నాన్ని సర్పంచ్ ఆర్.లక్ష్మితోపాటు క్లబ్ ప్రతినిధులు వ్యతిరేకించి అధికారులకు ఫిర్యాదు మేరకు ఆర్డీవో విచారణ జరిపారు. రికార్డుల్లో ఆ స్థలం పంచాయతీ స్థలంగా ఉన్నట్లు గుర్తించారు. వీఆర్వో జారీచేసిన పొజిషన్ ధ్రువపత్రం వల్లే స్థలవివాదానికి కారణమని నిర్ధారించారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించకుండా పొజిషన్ ధ్రువపత్రం జారీచేసిన వీఆర్వో తవుడుపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వెంకటేష్ రామానుజలు ఆర్డీవో ఆదేశించారు. పంచాయతీ రికార్డుల ఆధారంగా నివేదిక ఇవ్వాలని ఈవో మోహన్‌బాబును ఆదేశించారు. ఈస్థలంపై సర్వే నిర్వహించి సమగ్రనివేదిక అందించాలని తహసీల్దార్‌కు కోరారు.

ఆమె నేత్రాలు సజీవం



అచ్చమ్మ (ఫైల్)

అరసవల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని కొత్త దమ్మల వీధికి చెందిన అచ్చమ్మ(70) నేత్రాలను దానం చేశారు. బుధవారం అచ్చమ్మ మృతిచెందడంతో ఆమె కళ్లను దానం చేయాలని నిర్ణయించుకున్న కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్‌కు ఫోన్ చేసి వివరాలను తెలియజేశారు. దీంతో రెడ్‌క్రాస్ బృందం ఆమె కళ్ల నుంచి కార్నియాలు సేకరించింది. అచ్చమ్మ మరణించినా మరో ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన ఆమెకు రెడ్‌క్రాస్ సభ్యులు నివాళులర్పించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కబడ్డీ జట్ల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో బుధవారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాస్థాయి సీనియర్ కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించారు.జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 80 మంది పురుషులు, మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన జట్లు ఈ నెల 25 నుంచి అంకపాలేంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్న చౌదరి, కార్యదర్శి ఎ.చిరంజీవి తెలిపారు.

భక్తులకు వసతులు కల్పించండి

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



అరసవల్లిలో రథసప్తమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమికి వచ్చే భక్తులు వసతులు కల్పించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశించారు. బుధవారం అరసవల్లిలో రథసప్తమి ఉత్సవాల ఏర్పాట్లు, ఆలయ పరిసరాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవాలకు హాజరవుతారని, అవసరమైన అన్ని మౌలిక వసతులకు సంబంధించిన పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వై.భద్రాజీ, మున్సిపల్ ఎంఈ దక్షిణామూర్తి, సర్వేయర్ దుర్గాప్రసాద్, జేఈ చందన, అప్పారావు, టీడీపీ నాయకులు ఉంగటి వెంకటరమణ, పాపారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలోని విశాఖ-ఎ కాలనీలో గల తన కార్యాలయంలో గార, శ్రీకాకుళం రూరల్ మండలాల ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గతప్రభుత్వ దౌర్భాగ్య పరిపాలన వల్ల ప్రస్తుతం రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలపై వినతులు వస్తున్నాయని ఆరోపించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



గోశాల వద్ద నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

రణస్థలం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. బుధవారం పాతర్లపల్లి జడ్పీ ఉన్నతపాఠశాల తనిఖీ చేశారు. తరగతి గదుల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, భోజన నాణ్యత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

కమ్మసిగడాం జాతరకు ఏర్పాట్లు

ఫిబ్రవరి ఏడోతేదీ నుంచి మూడు రోజులపాటు జరిగే కమ్మసిగడాం జాతరకు ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. బుధవారం కమ్మసిగడాం మహాలక్ష్మి జాతరకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథసప్తమి రోజున 11 గంటలకు అమ్మవారి పెళ్లిరాట వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు వెలిచేటి రామకృష్ణ, వి.రాజారవిచంద్ర, సూర్యతేజ, కోశాధికారి వి.రాజశేఖర్, కార్యదర్శి మన్నె లక్ష్మీప్రసాద్, వి. సురేష్‌కుమార్, సింహచలరాయుడు పాల్గొన్నారు.

గోకులానంద ఆశ్రమంలో విగ్రహ ప్రతిష్ఠకు..

బంటుపల్లి పంచాయతీ పరిధిలో గల రాధాకృష్ణ మందిరంలో ఉన్న గోశాల, గోకులానంద ఆశ్రమంలో ఫిబ్రవరి మూడు నుంచి ఏడో తేదీ వరకూ జరిగే విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లను బుధవారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్రాల నుంచి ప్రముఖులు, దేశనలుమూల నుంచి సాధువులు, వేలాది మంది భక్తులు హాజరుకానున్నారని తెలిపారు.భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డుపనులకు శంకుస్థాపనచేస్తున్న రవికుమార్

బూర్జ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వైకుంఠపురం నుంచి అల్లిపల్లిగూడకు బీటీరోడ్డు పనులకు బుధవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ విశ్వ ప్రసాదొరెడ్డి, పైడి సత్య ప్రసాద్, బొడ్డేపల్లి సత్యం, మాజీ సర్పంచ్ ఎస్.సత్యం పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీకి 'గిడుగు' పేరు పెట్టాలి

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి గిడుగు రామ్మూర్తి పేరు పెట్టాలని శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక (తెరవే) ప్రతినిధులు కోరారు. బుధవారం శ్రీకాకుళంలోని కొత్త బ్రిడ్జి రోడ్డులో గల దత్తగుడి సమీపంలోని గిడుగు రామ్మూర్తి విగ్రహం వద్ద ఆయన వర్ధంతి నిర్వహించారు. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన జరిగిన కార్యక్రమంలో సభ్యులు ఐఎన్‌డీ ప్రసాద్, ఉమామహేశ్వరరావు, పూడి జనార్దన్ రావు, వి.రాజారావు డబ్బీరు గోవిందరావు, పి.లక్ష్మీనారాయణ తదితరులు గిడుగు రామ్మూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●కవిటి, జనవరి22(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వోన్నతపాఠశాలలో వ్యవహారిక భాషాపితామహుడు గిడుగు రామ్మూర్తి విగ్రహానికి ఎస్‌ఎంసీ చైర్మన్ టి.మోహనరావు పూలమాలవేశారు.కార్యక్రమంలో హెచ్ఎం బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

● శ్రీకాకుళం రూరల్,జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత్రునివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వండాన రామారావు,ఉపాధ్యాయులు దాష్టి సుదామణి, పిశిని వసంతరావు పాల్గొన్నారు.

●బూర్జ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాలలో గిడుగు రామ్మూర్తి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాలవలస చంద్రమౌళి, దాశరెడ్డి చిరంజీవరావు రామ్మూర్తి జీవితచరిత్రను విద్యార్థులకు వివరించారు.

రికార్డులు అందుబాటులో ఉంచండి

పొందూరు, జనవరి (ఆంధ్రజ్యోతి) 22: నాడు-నేడు పనుల రికార్డులను అందుబాటులోఉంచాలని ఆదేశించినట్లు శ్రీకాకుళం డిప్యూటీఈవో ఆర్. విజయకుమారి తెలిపారు.బుధవారం మండలంలోని లోలుగు జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుల, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ నాడు-నేడు పనులు జరిగిన పాఠశాలల్లో సామాజిక తనిఖీలు జరిగే నాటికి రికార్డు విధిగాఉండాలని తెలిపారు. ఆమెతోపాటు ఎంఈవో-2 పి. రాజారావు, హెచ్ఎం సంజీవిరావు ఉన్నారు.

నేరాల నివారణకు సీసీ కెమెరాలు దోహదం

లావేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని జేఆర్‌పురం సీఐ ఎం. అవతారం తెలిపారు. బుధవారం తాళ్లవలస వద్దగల జాతీయ రహదారిపై సీసీ కెమెరాలను ప్రారంభించారు. టీడీపీ మండలాధ్యక్షుడు ముప్పిడి సురేష్ ఆర్థిక సాయంతో వీటిని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.లక్ష్మణరావు, టీడీపీ నాయకులు గొర్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

ఎచ్చెర్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. చిలకపాలెం జంక్షన్‌లో పోలీసులు, నాగార్జున అగ్రికెమ్ సిబ్బంది సంయుక్తంగా బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మోటారు వాహనాల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలు విలీనం చేయవద్దు

కవిటి, జనవరి22(ఆంధ్రజ్యోతి): తెలుగుపాఠశాలల్లో ఒడియా పాఠశాలలను విలీనం చేయవద్దని ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్ష,కార్యదర్శులు భాస్కరపాడి, బృందావన్‌దొళాయి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. రాష్ట్రప్రభుత్వం జీవో-17 రద్దుచేసిన తర్వాత పాఠశాలలు పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఒడియాసెక్షన్ పాఠశాలలను విలీనం చేయవద్దని, ఒడియా మాధ్యమం ఉపాధ్యాయులను ఎప్పటిలాగే కేటాయించాలని కోరారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరించండి

ఇచ్ఛాపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నుంచి జగన్నాథపురం వెళ్లే జరడా ఆర్‌అండ్‌బీ సింగిల్ రహదారిలో ప్రమాదాలు జరుగుతుండడంతో విస్తరించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం విజయవాడలోని కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్ నాయిముల్లాకు వినతిపత్రం అందజేశారు. బాహుదానదిపై కొత్తగా వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

గూడ్స్ రైలు ఢీకొని ఆవులు మృతి

ఆమదాలవలస, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూసి రైల్వేగేట్ సమీపంలో బుధవారం గూడ్స్ రైలు ఢీకొని రెండు ఆవులు మృతిచెందాయి. బాధితుడి కథనం మేరకు..దూసిపేట గ్రామానికి చెందిన దవళ యతిరాజులు సాయంత్రం పశువులను మేతకు తీసుకునివెళ్లాడు. మేత మేసుకుని ఆవులు రైల్వేగేట్ సమీపంలో ఉన్న ట్రాక్‌పైకి వెళ్లాయి.ఆ సమయంలో విశాఖ నుంచి పలాస వెపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టడంతో ఆవులుఅక్కడికక్కడే మృతిచెందాయి. రూ.రెండు లక్షల విలువ చేసే ఆవులు మృతితో యతిరాజులు లబోదిబోమంటున్నాడు.

నేడు, రేపు ఇంటర్న్‌షిప్ డ్రైవ్

ఇచ్ఛాపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో గురు, శుక్రవారాల్లోప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ మెగా డ్రైవ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న ఎవరైనా 21-24 సంవత్సరాలు వయసు గల వారు ఇంటర్న్‌షిప్‌కు అర్హులని పేర్కొన్నారు. విద్యార్హతల సరిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయినమొబైల్ నెంబరు, మెయిల్ ఐడీతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేడు లోకేశ్ జన్మదిన వేడుకలు

అరసవల్లి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం ఉదయం 10 గంటలకునిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సుడా చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే

శ్రీకాకుళంఅర్బన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో బుధవారం శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) చైర్మన్ కొరికాన రవికుమార్‌ని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా పాతపట్నం,పాలకొండ నియోజకవర్గాలతో పాటు జిల్లాలో జనసేన పార్టీ పరిస్థితులపై చర్చించారు.

రొట్టవలసలో పశు వైద్యశిబిరం

సరుబుజ్జిలి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) :రొట్టవలసలో పశువైద్యశాల వైద్యాధికారి, సిబ్బంది ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో తాడేల రాజారావు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధచూపాలి

ఎచ్చెర్ల, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సబ్జెక్ట్‌ల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆ పాఠశాలల జిల్లా సమన్వయకర్త బాలాజీ నాయక్ కోరారు. బుధవారం దుప్పలవలస గురుకుల పాఠశాల/కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు ఫలితాల సాధనపై వర్క్‌షాపు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుకుల పాఠశాల/కళాశాలల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బోర చిట్టిరాజు, జిల్లాలోని తొమ్మిది గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్


మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళంక్రైం/రణస్థలం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): తోటి చిన్నారులతో ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు పోక్సో కేసులో అరెస్టు చేశారు. బుధవారం శ్రీకాకుళంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద రణస్థలం ఎస్‌ఐ ఎస్.చిరంజీవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు.. రణస్థలం మండలంలోని ఓ గ్రామానికి చెందిన నారు ప్రసాద్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఎన్ ఎంఆర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 13న భోగి నాడు గ్రామంలో తన ఇంటి ముందు స్నేహితులతో ఆడుకుంటున్న బాలికను ప్రసాద్ పిలిచాడు. బిస్కెట్లు, చాక్లెట్లు కొనిచ్చి సమీపంలో ఉన్న సచివాలయంపైకి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు కొద్ది రోజుల తర్వాత నొప్పితో బాధపడుతూ ఈ విషయాన్ని తన పిన్నికి తెలిపింది, ఆమె బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు ఈనెల 20న రణస్థలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేయగా శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద దర్యాప్తు చేశారు. ఈ మేరకు ఈనెల 21న రణస్థలం మండలం కంబాలపేట సమీపంలోని ఆర్చి వద్ద నిందితుడు నారు ప్రసాద్‌ను ఎస్‌ఐ చిరంజీవి అరెస్టు చేసి 22న రిమాండ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



పలాస, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని రైల్వే హెచ్‌సీ హరినాథ్ తెలిపారు. ప్లాట్‌ఫాంపైకి రైలు వస్తున్న సమయంలో దాని కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమంగా విద్యుత్ వైర్లు తరలిస్తున్న ముగ్గురిపై కేసు

జలుమూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్లను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. చల్లవానిపేట నుంచి మినీ వేన్‌పై విద్యుత్ వైర్లను తరలిస్తుండగా జమ్ము కూడలి వద్ద విజిలెన్స్ కానిస్టేబుల్ కె.సింహాచలం బుధవారం పట్టుకుని విద్యుత్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. కోటబొమ్మాళి విద్యుత్ డీఈఈ కె.విష్ణుమూర్తి ఫిర్యాదు మేరకు చల్లవానిపేటకి చెందిన పాగోటి లక్ష్మణరావు, వ్యాన్ డ్రైవర్ గొద్దు రమేష్, ఓనర్ జామి శ్రీనివాసరావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రమణమూర్తి (ఫైల్)

నరసన్నపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): దేవాది సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎచ్చెర్ల మండలం కొత్తపేటకి చెందిన గురుబెల్లి రమణమూర్తి (45) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నిమ్మాడ నుంచి స్వగ్రామం కొత్తపేటకు ద్విచక్రవాహనంపై వెళుతున్న రమణమూర్తి బండి అదుపు తప్పి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సోదరుడు తవిటినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఆమదాలవలసలో యాచకుడు..

ఆమదాలవలస, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద యాచకుడు షేక్ శ్రీనివాసరావు (49) మృతి చెందినట్టు ఎస్‌ఐ సనపల బాలరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మునిసిపాలిటీ పరిధిలోని లెప్రసీ కాలనీకి చెందిన శ్రీనివాసరావు పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు ఆలయాల వద్ద భిక్షాటన చేస్తూ ఉండేవాడు. బుధవారం శ్రీనివాసరావు మృతిపై కుమారుడు షేక్‌జోసెఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శవపంచనామా అనంతరం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు.

ఫ్లెక్సీల చించివేతపై పోలీసులకు ఫిర్యాదు

ఆముదాలవలస, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై మునగవలస జంక్షన్‌లో జనసేన, టీడీపీ నాయకులకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చించివేయడంపై ఫిర్యాదు వచ్చిందని ఆమదాలవలస ఎస్‌ఐ సనపల బాలరాజు తెలిపారు. సంక్రాంతి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ గ్రామస్థులు, యువత స్థానిక పెట్రోల్ బంక్ యజమాని ఉగాది రామినాయుడు ఆధ్వర్యంలో నాలుగు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో పాటు స్థానిక నాయకుల ఫొటోలున్నాయి. ఈ నాలుగు ఫ్లెక్సీల్లో రెండింటిని పూర్తిగా, మిగిలిన వాటిని పాక్షికంగా ధ్వంసం చేశారు. వైసీపీకి చెందిన వారే ఫ్లెక్సీలు ధ్వంసంచేసి ఉంటారని గ్రామ యువకులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.


మద్యం సీసాల స్వాధీనం

కొత్తూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తే చర్యలు తప్పవని శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ సీఐ లీలారాణి తెలిపారు. హిరమండలం మండలం సుభలయ నిర్వాసిత కాలనీకి చెందిన కిల్లాన అప్పలనాయుడు నుంచి 15 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

3.75 లక్షల పశువులకు ఏలికపాము నివారణ మందులు

జలుమూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి) జిల్లాలో 3.75 లక్షల ఆవులు, గేదెలుకు ఏలిక పాము నివారణ మందులు వేయడం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని పశు సంవర్ధకశాఖ జేడీ కె.రాజగోపాలరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి ప్రారంభించిన పశు వైద్య శిబిరాలు ఈనెలఖరు వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరాల్లో పశువులతో పాటు 45,914 దూడలకు, 7,19,985 గొర్రెలు, మేకలకు ఏలిక పాము నివారణ మందులు వేస్తున్నా మన్నారు. అన్ని గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. శీతాకాలం సీజన్ లో కోళ్లు, గొర్రెల, మేకలకు మసూచి రాకుండా టీకాలు వేస్తున్నామన్నారు.

రోడ్డు పక్క కూరుకుపోయిన ట్రాక్టర్


కూరుకుపోయి పీడీఎస్ బియ్యం ట్రాక్టర్

పాతపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలాంధ్రరోడ్‌లో బుధవారం ప్రజా పంపిణీ బియ్యంతో వెళుతున్న ట్రాక్టర్ రోడ్డు పక్క కూరుకు పోయి నిలిచి పోవడంతో పెనుప్రమాదం తప్పింది. వైసీపీ హయాంలో మెగా ఇంజనీరింగ్ పనుల్లో భాగంగా వేసిన పైప్‌లైన్ పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. ఇటీవల కేబుల్ వేసేందుకు గోతులు తీసి వాటిని పూడ్చడంలో సంబంధిత సంస్థ జాప్యంచేస్తుండడంతో తరచూ ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయి.

రక్తదానానికి యువత ముందుకు రావాలి: శిరీష


రక్తదానానికి పేర్లు నమోదు చేసుకుంటున్న దృశ్యం

పలాస, జనవరి 22(ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే శిరీష, యార్లగడ్డ వెంకన్న చౌదరి దంపతులు రక్తదానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం ఎంతో అవసరమని, జిల్లాలో రక్తనిల్వలు లేకపోవడంతో ఇతర జిల్లాల నుంచి తీసుకు రావాల్సి వస్తున్నందున దీనిని అధిగమించేందుకు యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. పార్టీ నేత లోకేష్ జన్మదినం సందర్భంగా టీడీపీ శ్రేణులు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ కొనసాగించి నియోజకవర్గంలో మంచి కార్యక్రమాలు చేద్దామని, అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, నేతలు పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, ఎం.నరేంద్ర (చిన్ని), గురిటి సూర్య నారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్, జోగ మల్లి, ఎ.రామకృష్ణ, కె.సత్యం, గోళ్ల చంద్రరావు, సూరాడ మోహనరావు, శాసనపురి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో విద్యాభివృద్ధికి చర్యలు

హరిపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బొగాబంద గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు రూ.34 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. జిల్లాకు ఐటీడీఏ లేకుండా పోయిందని మందసలో ఉన్న సబ్ కేంద్రాన్ని ఐటీడీఏగా ఏర్పాటుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ప్రధానంగా గిరిజన ప్రాంతంలో యువతకు విద్య, ఉద్యోగావకాశాల కల్పన తమ మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, పీరుకట్ల విఠల్, రట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, డోల తిరుపతిరావు, శంకర్, లబ్బ రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతు సంక్షేమమే లక్ష్యం: బగ్గు


లింగాలవలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రైతులు, పాడి రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. లింగాలవలసలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయ అనుబంధ రాగాలను బలోపేతం చేసేందుకు పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, గొర్రెలు పెంపకాలను ప్రోత్సహిస్తోందన్నారు. రాయితీపై మినీ గోకులాలు ఏర్పాటు చేసిందన్నారు. గొర్రెలు పెంపకం, కోళ్ల పెంపకం రైతులకు ప్రోత్సాహకాలు ఇస్తోందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ కె.రాజగోపాలరావు, డీడీ వి.జయరాజ్, డీఎల్‌డీవో డీడీ సత్యప్రకాష్, జలుమూరు, అచ్యుతాపురం పశు వైద్యాధికారులు ఎం.దీప్తి, పి.సంతోష్, టీడీపీ నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు, రామచంద్రరావు పాల్గొన్నారు.

బ్యానర్లపై ఎమ్మెల్యే ఫొటో ఏదీ?

పశు వైద్య శిబిరాల నిర్వహణకు సంబంధించి ఏర్పాటుచేసిన బ్యానర్లపై ఎమ్మెల్యే ఫొటో ముద్రించకుండా పశు సంవర్ధక శాఖ అధికారులు నిర్లక్ష్యం వహించారని టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లింగాలవలసలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరంలో ఏర్పాటు చేసిన బ్యానర్లపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఫొటో లేకపోవడంతో కార్యకర్తల్లో కలకలం రేపింది. ఇది ప్రొటోకాల్ ఉల్లంఘనేననివారన్నారు ఈ విషయమై పశుసంవర్ధకశాఖ జేడీ రాజగోపాలరావును వివరణ కోరగా పశు వైద్య శిబిరాల బ్యానర్లు నేరుగా డైరెక్టరేట్ నుంచి వచ్చాయన్నారు. అందుకు మేం చేసిందేమీ లేక ఆ బ్యానర్లు వాడుతున్నామన్నారు. స్థానికంగా బ్యానర్లు తయారుచేసి ఉంటే తప్పకుండా ఎమ్మెల్యే ఫొటోలు ప్రదర్శించే వారమన్నారు.

టెన్నీకాయిట్ రాష్ట్ర జట్టుకు శిక్షణ


శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

పలాస, జనవరి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు వెళ్లనున్న రాష్ట్ర జట్టుకు శిక్షణను బుధవారం ప్రారంభించారు. ఆ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.తవిటయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆరుగురితో పాటు ఇద్దరు స్టాండ్‌బై క్రీడా కారులకు తర్ఫీదు ఇవ్వడంతో పాటు పోటీల్లో పాల్గొనే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్త లను వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లా సంతోష్ కుమార్, కార్యదర్శి ఎస్వీ జోగారావు, వ్యాయామోపాధ్యాయులు బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు, మైదానం అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.భద్రయ్య, జె.మల్లేశ్వరరావు, టంకాల రవిశంకర్ గుప్తా, కె.తారక్, కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాల్సిందే..

ఎల్.ఎన్.పేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమయ పాలన పాటించాల్సిందేనని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని టెక్కలి డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ స్పష్టంచేశారు. బొర్రంపేట, తురకపేట-కృష్ణాపురం గ్రామ సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికలు, రికార్డులను పరిశీలించారు. ఇతర ప్రాంతాలకు విధులకు వెళితే మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో సంతకం చేయడంతో పాటు ఎందుకు వెళుతున్నారో నమోదు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రికార్డులు ప్రతికప్పుడు అప్‌డేట్‌లో ఉంచాలన్నారు. తురకపేట గ్రామ సచివాలయంలో ఆధార్ అప్‌డేట్‌కు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

పాతపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, సమయ పాలన పాటించాలని మండల ప్రత్యేకాధికారి డా. మంచు కరుణాకరరావు అన్నారు. ఆర్ఎల్‌పురం సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు పీఎంఘర్ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సచివాలయ కార్యదర్శి రాము, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ, డా. మంచు కరుణాకరరావు

కొత్తమ్మతల్లి సేవలో ఎస్పీ కుటుంబ సభ్యులు

కోటబొమ్మాళి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కొత్తమ్మతల్లిని ఎస్పీ కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ మేనేజర్ వాకచర్ల రాధాకృష్ణ స్వాగతం పలకగా పురోహితులు గణపతిశర్మ ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాన్ని అందించారు. అమ్మవారి ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో శోభాయాత్ర

కోటబొమ్మాళి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాల రాముడిని ప్రతిష్ఠించి ఏడాది అయిన సందర్భంగా కొత్తపేటలో బుధవారం శ్రీరామభక్తులు శోభా యాత్ర నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు స్థానిక శివకేశవ ఆలయం నుంచి కోటబొమ్మాళి రైతుబజార్ వరకు ర్యాలీ చేపటారు. అన్న ప్రసాద వితరణ చేశారు.



'వంశధార' రెగ్యులేటరు వద్ద చోరీపై పోలీసుల ఆరా

టెక్కలి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వంశధార ప్రధాన ఎడమకాలువ పరశురాంపురం సమీపంలో రెగ్యులేటరు వద్ద డోర్లు కట్ చేసి గేర్‌బాక్సు, స్క్రూరాడ్లు చోరీ చేసిన ఘటనపై బుధవారం పోలీసులు ఆరా తీశారు. వంశధార అధికారులతో కలిసి పరిశీలించారు. చోరీపై మంగళశారం వంశ ధార ఏఈ పి.భాస్కరరావు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

ఆర్‌వోబీల నిర్మాణంపై అధికారుల సమావేశం

టెక్కలి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): నౌపడా- మెళియాపుట్టి రోడ్డు ఇజ్జువరం, వడ్డివాడ సమీపంలో గోవిందపురం వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ)ల నిర్మాణానికి సంబంధించి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ, ఈస్ట్‌కోస్టు రైల్వే విశాఖ ఇంజనీరింగ్ అధికారులు సమావేశమయ్యారు. గోవిందపురం ప్రాంతంలో 3.25 ఎకరాలు, ఇజ్జువరం సమీపంలో 97 సెంట్ల భూమి ఆర్వో బీకి అవసరమని, అలాగే ఇక్కడ ఈ భూముల రైతుల వివరాలు ఈ ప్రాంతంలో ఉన్న స్ట్రక్చర్ల నిర్మాణాలు, చెట్లు తదితర వివరాలు సిద్ధం చేయాలని ఆ రెండు శాఖలు నిర్ణయించాయి. త్వరలో భూసేకరణ ప్రకటన జారీ చేసేందుకు నిర్ణయించారు. నెలరోజుల పాటు భూసేకరణకు పిలుపునిచ్చిన తరువాత నెల రోజుల్లో అక్కడున్న రైతుల అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు.

ఆపదలో ఉన్నవారికి భరోసా: ఎంజీఆర్


సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి కూటమి ప్రభుత్వ భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కిడ్నీవ్యాధితో బాధపడుతున్న కొత్తూరు మండలం కుంటిభద్ర గ్రామానికి చెందిన పిన్నింటి లక్ష్మణరావుకు సీఎంఆర్ఎఫ్ నుంచి విడుదలైన రూ.2 లక్షల మంజూరు పత్రాన్ని బుధవారం అందించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

పలాస, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. పదో తరగతి, పాలిటెక్నిక్, బీబీఏ, బీఎస్సీ, ఐటీఐ, బి.ఫార్మసీ చదివిన వారు అర్హులన్నారు. 24 ఏళ్ల లోపు వయసు, రూ.8లక్షల లోపు కుటుంబ వార్షిక ఆదాయం ఉండాలన్నారు. 12 నెలల శిక్షణా కాలంలో రూ.5 వేలు నుంచి రూ.6 వేలు స్టైఫండ్ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి

కోటబొమ్మాళి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను నిర్మూలించేందుకు జేవీవీ కృషి చేస్తోందని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం డి.గోవిందరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగాల పోటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సైన్సుపై ఆసక్తి పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమం లో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.సంజీవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించేందుకు సైన్స్ దోహదం

హరిపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు సైన్స్ దోహదం చేస్తుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. హరిపురం హైస్కూల్ ఆవరణలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 28న నిర్వహించనున్న సైన్స్ దినోత్సవానికి 8, 9, 10 తరగతుల నుంచి ముగ్గురు విద్యార్థులు మూడు నిమిషాల వీడియోను గూగుల్‌లో పంపి బహుమతులు గెలుపొందాలని సూచించారు. వివరాలకు 93985 24988 నెంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, ధర్మారావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

11 బీటీ రోడ్లు మంజూరు

వజ్రపుకొత్తూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలానికి 11 బీటీ రోడ్లు మంజూరయ్యాయని మండల పీఆర్ ఇంజనీర్ నాగభూషణ్ తెలిపారు. రూ.12.20 కోట్లతో 16 కిలో మీటర్ల మేర బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని చెప్పారు. పల్లిసారధి-గొల్లసారధి, మెట్టూరు పంచాయతీ ఒంకులూరు -బత్రివానిపేట, మంచినీళ్లపేట-దున్నవానిపేట, బాతుపురం పంచాయతీ పెదవంక నుంచి బీచ్ వరకు, రెయ్యిపాడు, బాతుపురం-రాజాం వరకు మిగిలిన రోడ్డు పనులు చేపట్టనున్నామన్నారు. మెట్టూరు- భవానిపేట ఉద్దాన రామకృష్ణాపురం-బొర్రవానిపేట, కొత్తపేట-దేవునల్తాడ, గునాలపాడు-అమలపాడు, నూకవానిపేట-దుక్కవానిపేట వరకు తారురోడ్ల నిర్మాణాన్ని త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎన్నికల విధుల సర్టిఫికెట్లు జారీ చేయండి

టెక్కలి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల 2024 సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయ సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మల్లేసు, ప్రధానకార్యదర్శి గోవింద రాజులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు.

నేడు లోకేశ్ జన్మదిన వేడుకలు

పాతపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కేక్ కట్ చేయడంతో పాటు ఆలయాల్లో ప్రత్యేకపూజలు, బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కూటమి కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించాలి

నరసన్నపేట, జనవరి 22(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి ఆదర్శంగా తీర్చిదిద్దాలని డీఎల్పీవో ఐవీ రమణ అన్నారు. నరసన్నపేట సంపద కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. నియోజకవర్గ కేంద్రంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చి సంపద సృష్టించి ఆదర్శంగా చేయాలన్నారు. పరిశీలనలో ఈవో ద్రాక్షాయణి, సిబ్బంది పాల్గొన్నారు.


చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో

న్యూస్ బాక్స్

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

పాతపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వైటీసీలో నిర్వహిస్తున్న మెళియాపుట్టి ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9492450649 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వీజీకే మూర్తి మృతి తీరనిలోటు

మందస, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా నాయకుడు వీజీకే మూర్తి మృతి ప్రజా ఉద్య మాలకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సభ్యుడు ఆర్.దిలీప్‌కుమార్ అన్నారు. మందస సీఐటీయూ కార్యాలయంలో బుధవారం మూర్తి సంస్మరణ సభ నిర్వహించారు. కార్య క్రమంలో పి.దేవేంద్ర, మట్ట ధర్మారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు 'గిడుగు'

పాతపట్నం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు ఆధ్వర్యంలో గిడుగు వేంకట రామ్మూర్తి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆంగ్ల, తెలుగు, సవర భాషలతో కూడిన నిఘంటువును రూపొందించిన గొప్ప సాహితీవేత్త అని కొనియాడారు. ఈయన మన జిల్లా పర్వతాలపేటలో జన్మించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్ర మంలో పాఠశాల సిబ్బంది, కేంద్ర ఆడిట్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయండి

నందిగాం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూలును వేగవంతం చేయాలని ఎంపీడీవో టి.రాజారావు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా ఇంటి పన్ను బకాయి, వసూళ్లపై సమీక్షించి లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. సమత్వ సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. చిన్నారులకు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినందున ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కలిగించారు.

వేతనదారుల సంఖ్య పెంచండి

నందిగాం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపట్టనున్న ఉపాధి పనుల వేతనదారుల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో టి.రాజారావు సూచించారు. ఫీల్డ్‌అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో పంచాయతీలు వారీగా పనుల ప్రగతిని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో ఎం.నాగరాజు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): కొత్తూరు 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెట్టూరు సర్వీస్ బ్రేక్ పాత బ్రేకర్‌ను తీసి కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయనున్నందున కొత్తూరు, మహాసింగి, బడిగాం, కుంటిభద్ర, వసపకాలనీ, మెట్టూరు, నీలకంఠాపురం, లబ్బ, గొట్టిపల్లి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఈ విష యాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు బొడ్డపాడు లేఅవుట్‌లో ప్లాట్లకు డ్రా

పలాస, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హౌసింగ్‌లో భాగంగా ఎంఐజీ ఫేజ్-1 కింద బొడ్డపాడు లో గురువారం ఉదయం 10 గంటలకు ప్లాట్లకు డ్రా తీసి స్థలాలు కేటాయించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌతు శిరీష, కలెక్టర్, జేసీ, సుడా వైస్‌చైర్మన్ హాజరవుతున్నారని, గతంలో ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు హాజరుకావాలని కోరారు.

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్పీ ఎస్ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేధ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్టు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94903 36550లో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.